క్లుప్తంగా

కేలండర్ ఆవిష్కరణ



మందుల బస్తీ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

ఓల్డ్ బోయిన్‌పల్లి: డివిజన్ పరిధిలోని మందుల బస్తీ కమిటీ నిర్వాహకులు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బస్తీవాసులతో ముచ్చటించారు. సమస్యలు ఏమైన ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా బస్తీ కమిటీ కేలండర్‌ను కార్పొరేటర్ ఆవిష్కరించారు. ప్రతి సంవత్సరం కేలండర్ ఆవిష్కరణకు ఆహ్వానిస్తున్న బస్తీవాసులకు కార్పొరేటర్ కృతజ్ఞతలు తెలిపారు.

పార్కు అభివృద్ధికి చర్యలు



పార్కును సందర్శించిన మహేశ్వరి శ్రీహరి

సనత్‌నగర్: కూకట్‌పల్లి నియోజకవర్గం బేగంపేట ద్వారకాదాస్ కాలనీ పార్కును అందరికీ ఆహ్లాదాన్ని పంచే కేంద్రంగా అందంగా తీర్చిదిద్దనున్నట్లు కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి స్పష్టం చేశారు. జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి మంగళవారం ఆమె పార్కును సందర్శించి అందులో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. రూ.35 లక్షలతో చేపట్టే పార్కు అభివృద్ధి పనుల్లో భాగంగా గ్రీనరీ, పాత్‌వే నిర్మాణం, వాకర్స్ సేదతీరేందుకు వీలుగా బెంచీల ఏర్పాటు, ఓపెన్ జిమ్, పిల్లలు ఆడుకునేందుకు క్రీడా సామగ్రి తదితర సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. త్వరితగతిన పనులు చేపట్టి పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చొరవతో ద్వారకాదాస్ కాలనీ పార్కు అభివృద్ధికి రూ.35 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఎమ్మెల్యే పర్యటనలో భాగంగా ఆయన దృష్టికి తెచ్చిన వెంటనే అన్ని సౌకర్యాలతో పార్కును అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీహరి, నరేష్, జీహెచ్‌ఎంసీ ఈఈ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

'మానూ'లో ఆడియో-విజువల్ ఆర్కైవింగ్‌పై వర్క్‌షాప్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ విశ్వవిద్యాలయంలో ఆడియో-విజువల్ ఆర్కైవింగ్‌పై వర్క్‌షాప్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 'మనూ'లోని ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్, నేషనల్ కల్చరల్ ఆడియో విజువల్ ఆర్కైవ్స్ (ఎన్‌సీఏవీ), ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్ (ఐజీఎన్‌సీఏ) సంయుక్త సహకారంతో ఫిబ్రవరి 21-23 మధ్యన ఆడియో-విజువల్ ఆర్కైవింగ్‌పై మూడ్రోజులపాటు వర్క్‌షాప్‌ను నిర్వహిస్తుంది. ఐఎంసీ డైరెక్టర్ రిజ్వాన్ అహమద్, ఎన్‌సీఏఏ కల్చరల్ ఇన్ఫర్మేటిక్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ప్రతాపానంద్‌ఝా, ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ ఇర్ఫాన్ జుబైరిలు పర్యవేక్షిస్తారు.

స్పెక్ట్రో ఫొటో మీటర్- బేసిక్‌పై వర్క్‌షాప్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో యూవీ-వీఐఎస్ స్పెక్ట్రో ఫోటో మీటర్-బేసిక్‌పై ఒక రోజు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. 'మనూ'లోని స్కూల్ ఆఫ్ సైన్సెస్ కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఎస్ఐఆర్-ఐఐసీటీ సీనియర్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ ప్రకృతి రంజన్‌బంగల్ యూవీ-వీఐఎస్ స్పెక్ట్రో ఫోటో మెట్రీ వెనుక, అణువులతో కాంతి పరస్పర చర్యపై అవగాహన కల్పించారు. కెమిస్ట్రీ, బయోకెమిస్ట్రీ రంగాల్లో దీని ప్రభావం గురించి వివరించారు. అనంతరం విద్యార్థుల పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. అనంతరం ల్యాబ్‌లో హ్యాండ్ ఆన్ సెషన్స్ యూవీ-వీఐఎస్ విధులను తెలుసుకోవడానికి పాల్గొనే వారికి అవకాశం కల్పించేందుకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్కూల్ ఆఫ్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ సల్మాన్ అహ్మద్‌ఖాన్, డాక్టర్ అలీముద్దిన్, డాక్టర్ ఖాసీముల్లా, విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

మంజీర పైపులైన్ పనులు పూర్తి చేయాలని వినతి

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఫ్లైఓవర్ నుంచి హుడా కాలనీ వరకు చేపట్టిన మంజీర పైపులైన్ పనులను త్వరగా పూర్తి చేయాలని హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బి ఎండీ సుదర్శన్‌రెడ్డికి శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌గౌడ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న మంజీరా పైపులైన్ పనులు మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న పైప్‌లైన్ పనులను త్వరతగతిన పూర్తి చేయాలని కోరామన్నారు. నియోజకవర్గం అభివృద్ధికి బాటలు వేస్తూ.. మౌలిక వసతులల కల్పనకు పెద్దపీట వేస్తామన్నారు.

పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచన



వాటర్‌వర్క్స్, ఇంజినీరింగ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్లు

కూకట్‌పల్లి: నూతన క్యాంపు కార్యాలయంలో వాటర్‌వర్క్స్, ఇంజినీరింగ్ విభాగం అధికారులతో మంగళవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమీక్ష సమావేశం నిర్వహించారు. గతంలో ప్రారంభించిన నీటి పైపులైన్ల పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను గుర్తించి వాటికి నిధులు అవసరమైతే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. నియోజకవర్గంలో ఎక్కడ ఎలాంటి సమస్య తలెత్తవద్దన్నారు. ఎండాకాలం దృష్టిలో ఉంచుకొని నీటి ప్రెషర్‌ను పెంచాలని అధికారులను ఆదేశించారు.

- ఈ సందర్భంగా పలువురు కార్పొరేటర్లు తమ పరిధిలో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. కార్పొరేటర్లు తెలిపిన పనులకు సంబంధించి అధికారులు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్ అధికారులు అందరూ సమన్వయంతో కలిసి పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, మందడి శ్రీనివాసరావు, ముద్దం నరసింహయాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, పండాల సతీష్‌గౌడ్, సబిహాబేగం, పగుడాల శిరీషబాబురావు, మహేశ్వరి శ్రీహరి, మాజీ కార్పొరేటర్లు తూము శ్రావణ్‌కుమార్, బాబురావు అధికారులు పాల్గొన్నారు.

ప్రతి డివిజన్‌లో పార్కులు, ఇండోర్ స్టేడియాలు నిర్మించాం

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కాలనీ ధనలక్ష్మి సెంటర్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న పార్కు పనులను మంగళవారం ఎమ్మెల్యే కృష్ణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్కును అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతున్నారని అధికారులను కొనియాడారు. మిగిలిన పనులు సత్వరమే పూర్తి చేసి పార్కును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. పార్కుకు కాంపౌండ్ వాల్ నిర్మించి ఆహ్లాదకరమైన మొక్కలు పెంచాలన్నారు. పిల్లలు ఆడుకోవడానికి ఏమైనా నూతన పరికరాలు కావాలంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజలు కూడా ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యమిస్తూ ప్రతి రోజు కొంత సమయాన్ని కేటాయించాలన్నారు. ప్రతి డివిజన్‌లోను గత పదేళ్లుగా పార్కులు, ఇండోర్ స్టేడియాలు నిర్మిస్తూ వచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈ సత్యనారాయణ, డీఈ ఆనంద్, అధికారులు పాల్గొన్నారు.



దనలక్ష్మి సెంటర్ వద్ద పార్కు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, అధికారులు





పార్కులో ఏర్పాటు చేస్తున్న విగ్రహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

చోరీలకు పాల్పడుతున్న యువకుడి అరెస్టు



నిందితుడు పెదవల్లి సంజయ్‌కుమార్

భాగ్యనగర్‌కాలనీ: పగలు రెక్కి... రాత్రిళ్లు చోరీ... ఇంటికి వేసిన తాళాలు పగలగొట్టి దొంగతనానికి పాల్పడుతున్న యువకుడిని కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కూకట్‌పల్లి ఏసీపీ శివ భాస్కర్‌తో కలిసి కేపీహెచ్‌బీ సీఐ వెంకన్న వివరాలను వెల్లడించారు. గుంటూరు జిల్లా చిలకలూరిపేట మండలం, లింగంగుంట్ల గ్రామానికి చెందిన పెడవల్లి సంజయ్‌కుమార్ (23) అనే యువకుడు కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అడ్డగుట్టలో ఓ హాస్టల్‌లో నివాసముంటున్నాడు. పగలు రెక్కి నిర్వహించి తాళాలు వేసిన ఇళ్లను గుర్తించి తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడుతున్నారు. ఇండ్ల తాళాలను ఇనుప రాడ్ సహాయంతో పగుల గొట్టి చోరీకి పాల్పడిన అనంతరం ఆ ఇంటికి మరో తాళం వేసి పారిపోయేవాడు.

- గత నెల 30వ తేదీ కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజులో ఇదే రీతిన చోరీకి పాల్పడ్డాడు. ఇంటి యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసిన పోలీసులు సోమవారం అడ్డగుట్టలో అనుమానస్పందంగా తిరుగుతున్న సంజయ్ కుమార్‌ని అదుపులోకి తీసుకొని విచారించగా పాత నేరస్తుడిగా గుర్తించారు.
- దీంతో అతని వద్ద రూ.12 లక్షల విలువ చేసే 20.6 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. సంజయ్ గతంలో కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలోనే 5, తిరుపతిలో 5 చోరీలకు పాల్పడినట్లుగా ఏసీపీ తెలిపారు. కేసును త్వరితగతిన పరిష్కరించిన సీఐ వెంకన్న, డీఐ రాజేందర్‌గౌడ్, కానిస్టేబుళ్లను ఏసీపీ శివభాస్కర్ అభినందించారు.



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న కూకట్‌పల్లి ఏసీపీ శివ భాస్కర్

సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ పత్రం అందజేత

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ కాలనీకి చెందిన మాలతి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకుంది. సహాయనిధి లక్ష రూపాయలకు చెందిన ఎల్‌ఓసీ మంజూరు పత్రాన్ని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మంగళవారం ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కాశీనాథ్ యాదవ్, సలీం, బాబుమియా తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

సందడిగా స్కూల్ వార్షికోత్సవం

గచ్చిబౌలి: చిన్నారుల ఆట,పాటలతో బచ్‌పన్ స్కూళ్ల వార్షికోత్సవం సందడిగా సాగింది. మంగళవారం మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో మాదాపూర్, కొండాపూర్ బచ్‌పన్ స్కూళ్ల వార్షికోత్సవం నిర్వహించారు. ఫెస్టివ్ థీమ్‌లో వసుదైక కుటుంబం, జాతీయ భావం పెంపొందించే డ్యాన్స్‌లతో చిన్నారులు అలరించారు. బచ్‌పన్ స్కూల్స్ డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాస్‌రావు, ప్రిన్సిపాల్స్ నిషా, రాఘవి తదితరులు పాల్గొన్నారు.



డ్యాన్స్‌తో అలరించిన మాదాపూర్ బచ్‌పన్ విద్యార్థులు

ప్లాస్టిక్ కవర్ల వాడకం తగ్గించాలి

గచ్చిబౌలి: ప్లాస్టిక్ కవర్ల వాడకం తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలని మాజీ ఎంపీ, బీజేపీ నాయకులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కొండాపూర్‌లోని మైహోం మంగళ రోడ్డులో కూరగాయల మార్కెట్‌లో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రవికుమార్‌యాదవ్‌తో కలిసి జ్యూట్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. పర్యావరణం కాపాడటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని గుర్తు చేశారు. పర్యావరణం కాలుష్యం బారిన పడటంతో ప్రకృతి సమతౌల్యం దెబ్బతింటుందన్నారు. బీజేపీ నాయకులు ఎల్లేష్, ఆంజనేయులు, శ్రీధర్, రమేష్, రవినాయక్, శ్రీశైలం, కుమార్‌యాదవ్, సాగర్, శ్రీకాంత్ తదితరులున్నారు.

మాదాపూర్‌లో 'లైవ్ పాప్సికల్'

సాక్షి, సిటీబ్యూరో: అప్పటికప్పుడు సహజమైన పండ్ల సమ్మేళనాలతో డెజర్ట్ (లైవ్ పాప్సికల్స్) తయారు చేసి అందించే ఓ కేఫ్ మాదాపూర్‌లో అందుబాటులోకి వచ్చింది. స్కుజో ఐస్ 'ఓ' మ్యాజిక్ పేరుతో హైటెక్ సిటీ రోడ్ మాదాపూర్ వేదికగా ఈ వినూత్న డెజర్ట్ కేఫ్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ కె.చంద్ర శేఖర్ రెడ్డి, స్కుజో వ్యవస్థాపకుడు గగన్ ఆనంద్ పాల్గొన్నారు.

'గృహజ్యోతి' సర్వే షురూ

- రేషన్, ఆధార్ నెంబర్లు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్
- వినియోగదారుల్లో చిగురిస్తున్న ఆశలు



విద్యుత్ మీటర్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్న సిబ్బంది

సనత్‌నగర్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా గృహజ్యోతి పథకం కింద లబ్ధిదారుల ఎంపిక కోసం ఎట్టకేలకు సర్వే ప్రారంభమైంది. స్థానికంగా ఉండే ఎలక్ట్రికల్ ఇంజినీర్లకు ఉన్నతాధికారుల నుంచి గైడ్‌లైన్స్‌తో రావడంతో మంగళవారం నుంచి ప్రక్రియ షురూ అయ్యింది. ప్రధానంగా రేషన్, ఆధార్ కార్డులను బేరీజుగా చేసుకుని గృహజ్యోతి లబ్ధిదారుల ఎంపికకు శ్రీకారం చుట్టారు. యజమానులు, అద్దెకుండేవాళ్లు తేడా లేకుండా విద్యుత్ బిల్లులు చెల్లించే ప్రతి ఒక్కరి ఆధార్, రేషన్‌కార్డు నెంబర్లను అప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే తంతు మొదలైంది.

చిగురిస్తున్న ఆశలు..

గృహజ్యోతి పథకం కింద జరుగుతున్న సర్వేతో సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలో ఉన్న పేద, మధ్యతరగతి ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. నెలకు 1-200 యూనిట్లు వినియోగించే నివాసితులకు ఈ పథకాన్ని అమలుచేయాలని ప్రభుత్వం హామీచ్చిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలో 1-200 యూనిట్లు వినియోగించే గృహ వినియోగదారుల జాబితాను సిద్ధం చేసే పనిలో పడ్డారు. ముందుగా కరెంటు బిల్లు జారీ అయ్యే ప్రతి కుటుంబం నుంచి రేషన్ కార్డు, ఆధార్‌కార్డు నెంబర్లను ఆన్‌లైన్‌లో పొందుబరుస్తున్నారు. ఆ తర్వాత వారు వాడుతున్న యూనిట్ల ఆధారంగా చేసుకుని లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. అయితే రేషన్‌కార్డు లేని వారి ఆధార్ నెంబర్లను కూడా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తుండడంతో ఎవరెవరిని లబ్ధిదారులుగా చేరుస్తారనే దానిపై స్పష్టత లేదు. ఎవరికి వారు తమకు లబ్ధి చేకూరుతుందనే ఆశతో ఎదురుచూస్తున్నారు.



వారికే లబ్ధి..

సనత్‌నగర్ సెక్షన్ కార్యాలయ పరిధిలో మొత్తం 27,013 గృహ వినియోగ (డొమెస్టిక్) కనెక్షన్లు ఉండగా ప్రభుత్వం నిర్దేశించిన యూనిట్ల మేరకు శ్యామలకుంట, దాసారంబస్తీ, ఎస్‌ఆర్‌టీ, శివాజీనగర్, డీఎస్‌ఎంకాలనీ, అశోక్‌కాలనీ తదితర ప్రాంతాల్లో లబ్ధిదారులు ఎక్కువగా ఉండే అవకాశాలు ఉన్నాయి. ఇక ఎస్సార్‌నగర్ సెక్షన్ పరిధిలో 23,672 డొమెస్టిక్ కనెక్షన్లు ఉండగా ఇక్కడ అమీర్‌పేట కుమ్మరి బస్తీ, రేణుకానగర్, బీజేఆర్‌నగర్, బుద్ధనగర్, సిక్‌బస్తీ తదితర ప్రాంతాల్లో ఎక్కువగా లబ్ధిదారులు ఉండే అవకాశాలు ఉన్నాయి. బేగంపేట సెక్షన్ పరిధిలో 27,752 డొమెస్టిక్ కనెక్షన్లు ఉంటే బస్తీలు కూడా ఎక్కువగా ఇక్కడే ఉన్నాయి. వీటిలో దాదాపు 50 శాతం లబ్ధిదారులకు గృహజ్యోతి కింద లబ్ధి చేకూరే అవకాశాలు ఉన్నట్లు కనిపిస్తోంది. 1-200 యూనిట్లను పరిగణలోకి తీసుకుంటే ఎక్కువ శాతం బస్తీల్లోనే లబ్ధిదారులు ఉంటారు.

బాల్క సుమన్ క్షమాపణ చెప్పాలి



మూసాపేట చౌరస్తాలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని మంగళవారం కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి నియోజకవర్గాల కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలు కూడళ్లలో బాల్క సుమన్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. సీఎంపై వ్యాఖ్యలు చేసిన బాల్క సుమన్‌పై చర్యలు తీసుకోవాలని పలు పోలీస్‌స్టేషన్లలో కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. -కూకట్‌పల్లి జోన్ బృందం



బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తూ నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

'సీలింగ్ భూములను పట్టా భూములుగా మారుస్తున్నారు'

రాష్ట్ర బీజేపీ మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి

దుండిగల్: సీలింగ్ భూములను పట్టాభూములుగా మార్పిడి చేస్తు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బీజేపీ మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి అన్నారు. గండిమైసమ్మ దుండిగల్ మండల తహసీల్దార్ సుచరితను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. మండలంలోని దుండిగల్ గ్రామంలో 282 నుంచి 426 సర్వే నెంబర్లలోని పలు ప్రాంతాల్లో 106.07 ఎకరాల సీలింగ్ భూమి ఉందన్నారు. సీలింగ్, పట్టా భూములు పక్క పక్కనే ఉండడంతో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా భూములను మార్పిడి చేస్తున్నారని అన్నారు. ఇలా చేస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

భారత్ బంద్ పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

కూకట్‌పల్లి: దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ కూకట్‌పల్లి భవన నిర్మాణ కార్మిక సంఘం పిలుపునిచ్చింది. మంగళవారం కూకట్‌పల్లిలోని అడ్డాలో భారత్‌బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 16న అఖిల భారత స్థాయిలో కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్ పాటించాలని నిర్ణయించాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.శంకర్, బి.రాములు భవన నిర్మాణ కార్మికులు నరసింహ, రామస్వామి, శంకర్, నాగన్న, అశోక్, శ్యామ్, రమేష్, కృష్ణ, అంజయ్య, పోచయ్య, భాస్కర్, శ్రీనివాస్, గోపాల్, రామచంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ - టీఎస్ డైరీ ఆవిష్కరణ



మూసాపేట పాఠశాల హెచ్‌ఎం ఆరిఫ్ ఖాన్‌కు డైరీ అందజేస్తున్న పీఆర్‌టీయూ-టీఎస్ నాయకులు

మూసాపేట: మూసాపేట ప్రభుత్వ బాలుర పాఠశాలలో పీఆర్‌టీయూ - టీఎస్ కూకట్‌పల్లి మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పీఆర్‌టీయూ-టీఎస్ డైరీని ఆవిష్కరించారు. అనంతరం పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఆరిఫ్ ఖాన్‌కు నేమ్ ప్లేట్‌తో పాటు డైరీని బహూకరించారు. ఈ డైరీ ఉపాధ్యాయులు తమ హక్కులు, బాధ్యతలు తెలుసుకొని సమస్యలు సాధించుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు నరేందర్ గౌడ్, పర్మగల్ల నర్సిములు, రాష్ట్ర బాధ్యులు క్రిష్ణయ్య, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌ను కలిసిన గంగపుత్ర సంఘం సభ్యులు



కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌ను సన్మానిస్తున్న గంగపుత్ర సంఘం నూతన కమిటీ సభ్యులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ నూతన గంగపుత్ర సంఘం కమిటీ సభ్యులు మంగళవారం కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు జనార్దన్, ప్రధాన కార్యదర్శి అశోక్, గంగపుత్ర సంఘం దేవాలయ కార్యదర్శి పెంటయ్య, సభ్యులు కార్పొరేటర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు దానయ్య, భిక్షపతి, రాజు, సంజీవ, నారాయణ, శివ, నర్సింగ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాలాపై ఆక్రమణలను తొలగించండి



అమీర్‌పేట: అమీర్‌పేట గాయత్రినగర్‌లోని నాలాపై ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధికారులను ఆదేశించారు.రూ.1.5 కోట్ల వ్యయంతో చేపట్టిన నాలా రీమోడలింగ్ పనులను అధికారులతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. సగం పనులు పూర్తయ్యాయని, అక్రమ నిర్మాణాల కారణంగా పనులు ముందుకు సాగడం లేదని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.ఎక్కడెక్కడ ఆక్రమణలు ఉన్నాయో గుర్తించి వాటిని పరిశీలించి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. వర్షాకాలంలో రోడ్లపైకి నీరు చేరి స్థానిక ప్రజల ఇబ్బందులకు దృష్టిలో ఉంచుకుని నాలా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని గుర్తు చేశారు.సమన్వయంతో వ్యవహరిస్తూ అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఆయన వెంట ఎస్.శేషుకుమారి, డీసీ జగన్, ఈఈ ఇందిర, మోహన్, హరిశంకర్,వంశీ,మనోహర్ ఉన్నారు.

ఓపెన్ జిమ్ ప్రారంభం..

వయోవృద్ధులు సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణతో పాటు ఆరోగ్య పరిరక్షణ విషయంలో శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు.సనత్‌నగర్ బీకేగూడలో గల సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ ఆవరణలో రూ.6 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రోజులో కొంత సమయాన్ని జిమ్‌కు కేటాయించి తద్వారా ఆరోగ్యాన్ని మరింత పటిష్టం చేసుకోవాలని సూచించారు.అంతా కలిసి కట్టుగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మిబాల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ శేషుకుమారి,కౌన్సిల్ అధ్యక్షులు మాణిక్‌రావు పాటిల్, కార్యదర్శి యాదగిరి,సహదేవ్‌గౌడ్,లింగమయ్య, మాణిక్‌రావు, అనంత్‌రెడ్డి, భద్రయ్య పాల్గొన్నారు.